https://vijayamdaily.com

# విజయం

అక్షర సమరానికి నాంది..

ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం

పేజీలు : 12 | మంగళవారం సెప్టెంబర్ 05 2023 | https://vijayamdaily.com



# చరిత్ర సృష్టించిన ట్రాన్స్ జెండర్ రూత్ జాన్ కొయ్యల





- ట్రాన్స్ జెండర్ కోటాలో పీజీ సీట్ సాధించిన రూత్ జాన్
- ఘనంగా సన్మానించి అభినందించిన జిల్లా కలెక్టర్
- పీజీ పూర్తి కాగానే ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామి

ఖమ్మం, సెప్టెంబర్ 4(విజయంన్యూస్):

ట్రాన్స్ జెండర్ రూత్ జాన్ కొయ్యల చరిత్ర సృష్టించారు. నేటి సమాజంలో ట్రాన్స్ జెండర్ లకు ఎక్కడా గుర్తింపు లేదని పలు అలవాటులకు వెళ్తున్న తరుణంలో రూత్ జాన్ కొయ్యల పీజీ చదువుకునేందుకు కోర్టును ఆశ్రయించి ట్రాన్స్ జెండర్ కోటాలో పీజీ సాధించారు. దీంతో జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ ఘనంగా సన్మానించి అభినందించారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే ట్రాన్స్ జెండర్, అట్టడుగు వర్గాలకు రూత్ జాన్ కొయ్యల ఆదర్శంగా నిలిచారని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వైద్య పీజీ సీటు పొందిన ఖమ్మం జిల్లా కు చెందిన ట్రాన్స్ జెండర్ రూత్ జాన్ కొయ్యలను కలెక్టర్ ఘనంగా సన్మానించారు.

2లో..

# నాలుగేళ్లలో నలుదిక్కుల అభివృద్ధి



- సీఎం కేసీఆర్ దయవల్లనే ప్రజలకు సేవ చేశా
- ఇంటింటికి కళ్యాణలక్ష్మి నన్ను సంతృప్తి చేసింది
- మున్నేరుకు ఆర్ సిసి రక్షణ గోడ
- 4వేల కోట్లతో ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి
- అసెంబ్లీలో ఖమ్మం పోటోలు చూపిస్తుంటే సంతోషమేసింది
- ఖమ్మం కోసం ఏదైనా చేయాలనిపిస్తుంది.. ఇంకా చేయాల్సి ఉంది
- తట్టెడు మట్టి పోయనోళ్ల గురించి మాట్లాడటం ఇష్టం లేదు
- నాలుగేళ్లు మంత్రిగా పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉంది
- మీడియా చిట్ చాట్‌లో మంత్రి పువ్వాడ

(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

రాష్ట్ర మంత్రిగా నాకు అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కే.చంద్ర శేఖర్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని, ఆయన ఇచ్చిన అవకాశంతో నాలుగేళ్లలో ఖమ్మం నలుదిక్కులను అద్భుతంగా అభివృద్ధి చేశానని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన నివాసంలో మీడియాతో చిట్ చాట్ లో పాల్గొన్నారు.

5లో..

# మత్స్యకారుల ఇంటిలో వెలుగులు నింపింది సీఎం కేసీఆర్

**జిల్లాలో 186 చెరువులకు ఉచితంగా చేప పిల్లలు పంపిణి**

**కోటపాడు మాచినేని చెరువులో 75వేల చేపపిల్లలను విడుదల చేసిన మంత్రి**




ఖమ్మం, సెప్టెంబర్ 4(విజయం న్యూస్):

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలనే ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ చేపట్టిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. సోమవారం ఖమ్మం నియోజకవర్గం రఘునాధపాలెం మండలం కోటపాడు గ్రామంలోని మాచినేని చెరువులో ప్రభుత్వం పంపిణీ చేసిన 75 వేల చేప పిల్లలను (రోహు, మ్రిగాల, కట్ల రకాల చేప పిల్లలు) మంత్రి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్‌తో కలిసి చెరువులో వదిలారు. ముందుగా గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మత్యకారుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేశారని, నాడు చేపలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి నేడు ఎగుమతి చేసుకునే స్థాయికి వెళ్లామన్నారు.

2లో..

https://vijayamdaily.com
# విజయం
అక్షర సమరానికి నాంది..
ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం



పేజీలు : 12 మంగళవారం సెప్టెంబర్ 05 2023 https://vijayamdaily.com

# ముహూర్తం డిసెంబర్ '6'

- అక్టోబర్ 1న అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్..?
- జమిలి ఎన్నికలకు బ్రేక్..?
- చట్టపరమైన చిక్కులు వచ్చే అవకాశం
- ఐదు రాష్ట్రాలకు ఎన్నికలను నిర్వహించే యోచనలో సీఈసీ

(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సీఈసీ పచ్చజెండా ఊపనుందా..? డిసెంబర్ మొదటి వారంలో ఎన్నికలను నిర్వహించేందుకు కసరత్తు చేస్తుందా..? అందుకు మహూర్తం ఖరారైయ్యే అవకాశం ఉందా..? అక్టోబర్ లో ఎన్నికల ప్రక్రియ షురూ అవుతుందా..? జమిలి మాటున ఎన్నికలు వాయిదా పడే అవకాశం లేదా..? జమిలి ఎన్నికలు జరిగే అవకాశం లేదా..? అంటే నిజమేనంటున్నారు రాజకీయ విశ్లేషకులు.. దేశవ్యాప్తంగా ఒకే నేషన్..ఒకే ఎలక్షన్ అంటూ కేంద్రప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చిన జమిలి ఎన్నికల నిర్వాహణ చాలా కష్టంగా మారే అవకాశం ఉందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.. చట్టాలు.. సవరణలు ఇప్పటికిప్పుడు సాధ్యసాధ్యాలు కావాని అభిప్రాయపడుతు న్నారు.. అందుకే అసెంబ్లీ ఎన్నికలు ముందు జరిగే అవకాశం ఉందని భావిస్తున్నా రు.. అసలు జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే చట్టాలు ఏం చెబుతున్నాయి..? సీఈసీ ఏం చెబుతోంది..? ఒకే నేషన్..ఒకే ఎలక్షన్ అనే జమిలి సాధ్యమేనా..? అనే పూర్తి స్థాయి వివరాలను చూడాలంటే విజయం ప్రతినిధి అందించే రాజకీయ విశ్లేషణాత్మక కథనం చదవాల్సిందే..? భారతదేశంలో 2018 సంవత్సరంలో నాలుగు రాష్ట్రాలకు ఎన్నికలు జరిగా యి.. చత్తీస్ గడ్, మీజోరం, రాజస్తాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సమయాను కూలంగా, ముందస్తుగా వెళ్లిన తెలంగాణ రాష్ట్రానికి అసెంబ్లీ జరిగాయి. ఆ నాలుగు రాష్ట్రాలకు 2018 డిసెంబర్ 7న పోలింగ్ జరిగింది.. అయితే ఈ రాష్ట్రాలకు రాజ్యంగ చట్టం ప్రకారం ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు జనవరి 16లోపు ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.. ఈమేరకు కేంద్ర ఎన్నికల కమీషన్ ఆ దిశగా అడుగులు వేస్తోంది.. నాలుగు రాష్ట్రాలకు ఒకే సారి ఎన్నికలను నిర్వహించేందుకు కావాల్సిన చర్యలు చేపట్టింది.. కచ్చితంగా సమయానుకూలంగా ఎన్నికలను జరపాల్సి వస్తే జనవరి 16 నాటికి ఆ ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలను పూర్తి చేయాల్సి ఉంటుంది.. ఆదిశగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ పార్టీలు కూడా సంసిద్ధమవుతున్నారు. అందులో తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే ఎన్నికల హీట్ షూరు అయ్యిందనే చెప్పాలి.

మిగతా 3లో..



# మత్స్యకారుల ఇంటిలో వెలుగులు నింపింది సీఎం కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి..)

రైతు బంధు, రైతు భీమా, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. మధ్యవర్తుల వ్యవస్థను రూపుమాపడం కోసం ప్రభుత్వం రాయితీపై చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి మరోసారి గుర్తు చేశారు. ఇతర రాష్ట్రాల్లో చేపలను విక్రయించడానికి వాహనాలను రాయితీపై ఇచ్చిందని తెలిపారు. నీలి విప్లవంను ప్రోత్సహించేందుకు మత్స్యసంపదను సృష్టిస్తున్నరని అన్నారు. సబ్బండ వర్గాల కులవృత్తులను ప్రోత్సహిస్తూ వారికి అండగా ప్రభుత్వం నిలుస్తుందన్నారు. ఖమ్మం జిల్లాలో సహజ నీటి వనరులపై ఆధారపడి నేటివరకూ జిల్లాలో 186 సహకార సంఘాల నమోదు అయ్యాయన్నారు. ప్రాథమిక సంఘాలు 143, మహిళ సంఘాలు 30, హరిజన సంఘాలు 6, గిరిజన సంఘాలలో 14031 మంది మత్స్యకారులకు సభ్యత్వం కల్పించామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, 2023-24 సంవత్సరానికి గాను 100 శాతం రాయితీపై జిల్లాలోని 903 చెరువుల్లో 362.59 లక్షల చేప పిల్లలు వదులుటకు లక్ష్యం నిర్ణయించామన్నారు. ఖమ్మం నియోజకవర్గంలోని 54 నీటి వనరుల్లో 3.35 లక్షల చేప పిల్లలు వదలనున్నట్లు ఆయన తెలిపారు. నిబంధనల మేరకు చేప పిల్ల సైజు, రకం, సంఖ్య ఉండేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, మత్స్య శాఖ ఏడి ఆంజనేయస్వామి, పీఆర్ ఇఇ కెవికె. శ్రీనివాస్, రఘునాథపాలెం ఎంపిడివో రామకృష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు, మత్స్య సహకార సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించిన ట్రాన్స్ జెండర్ రూత్ జాన్ కొయ్యల

(మొదటిపేజీ తరువాయి..)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి సమాజంలో ట్రాన్స్ జెండర్‌లకు ఎక్కడా గుర్తింపు లేదని, వారిలో చదువుకున్న వారు చాలా తక్కువని, ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులను దాటుకుని రూత్ జాన్ కొయ్యల చరిత్ర సృష్టించారని అన్నారు. రెండు సంవత్సరాలు న్యాయ పోరాటం చేసి, ట్రాన్స్ జెండర్ కోటాలోనే పీజీ సీట్ సంపాదించారని ఆయన తెలిపారు. పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని నిరూపించారని, పీజీ పూర్తయిన తర్వాత ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగ అవకాశం కల్పిస్తానని ఆయన అన్నారు. ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి, లక్ష్యం సాధించడం చాలా గొప్ప విషయమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రూత్ జాన్ కొయ్యల మాట్లాడుతూ, అవకాశం కోసం చూడడం కాక, అవకాశాలను సృష్టించాలానే ధ్యేయంగా కష్టపడి చదివినట్లు తెలిపారు. నట జీవితంలో కాక, నిజ జీవితంలోనే ఏదైనా సాధించవచ్చన్నారు. రానున్న రోజుల్లో ట్రాన్స్ జెండర్లకు మంచి అవకాశాలు రావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జెడ్పి సిఇఓ అప్పారావు, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా. బి. మాలతి, జిల్లా సంక్షేమ అధికారిణి సుమ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## యాదవ జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి

### యాదవ జర్నలిస్టుల సంఘం ఇల్లందు కోఆర్డినేటర్ రవీందర్ యాదవ్

(ఇల్లందు-విజయంన్యూస్)



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యాదవ జర్నలిస్టులను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్న ఉద్దేశంతో సెప్టెంబర్ 12వ తేదీన హైదరాబాద్ శుభం గార్డెన్స్ నాగోలు లో రాష్ట్రస్థాయి యాదవ జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం చేపట్టనున్నట్లు యాదవ జర్నలిస్టుల సంఘం ఇల్లందు నియోజకవర్గ కోఆర్డినేటర్ రవీందర్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే ఉమ్మడి జిల్లాల వారీగా టి వై జె యు అడహాక్ కమిటీలు వేసుకోవడం జరిగిందన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు. ఎంతో కాలంగా మనమందరమూ ఎదురు చూస్తున్న రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించాలని రాష్ట్ర అడహాక్ కమిటీ నిర్ణయించినట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహణ,ఎజెండా, సభ్యత్వ నమోదు, ఆహ్వానితులు వంటి అంశాలపై రాష్ట్ర నాయకత్వం జిల్లా బాధ్యులైన కన్వీనర్లు, కో-కన్వీనర్లతో చర్చించి, నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.యాదవ జర్నలిస్టుల ఐక్యతను చాటడంతోపాటు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న అనేక సవాళ్లు,సమస్యలు, సాధక బాధలను పంచుకోవడంతో పాటు కలిసికట్టుగా ఎలా ముందుకు వెళ్లాలి, ఎలాంటి ఎజెండాతో వెళ్లాలి?ఎలాంటి కార్యాచరణ తీసుకోవాలి? వృత్తిపరంగా ఎదురవుతున్న సమస్యలను ఉమ్మడిగా ఎలా ఎదుర్కోవాలి? తదితర అంశాలపై చర్చించి,ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.యాదవ జర్నలిస్టు సోదరులకు ఎప్పుడూ ఏ సమస్య ఎదురైనా,ఏ ఆపద వచ్చినా మేమంతా నీ వెంటే ఉన్నామనే భద్రత, భరోసాను ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి యాదవ జర్నలిస్టుపై ఉందని గుర్తు చేశారు. ప్రతి సభ్యుడూ తప్పనిసరిగా హాజరై, ప్రతిష్టాత్మకమైన యాదవ జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనాన్ని దిగ్విజయం చేయాలని పేరుపేరునా విజ్ఞప్తి చేశారు.

# డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలి

## గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

## అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్



**ఖమ్మం, సెప్టెంబర్ 4(విజయంన్యూస్):** వర్షాల దృష్ట్యా డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం నూతన కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో డెంగ్యూ నియంత్రణపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు ప్రధానమని, తదనుగుణంగా జిల్లాలో డెంగ్యూ నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. గతంలో నమోదైన కేసులపై సమీక్షించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లాలో గత రెండు మూడు సంవత్సరాలుగా కేసులు అధికంగా నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి నియంత్రణ చర్యలు చేపట్టాలని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సంవత్సరం జనవరి నుండి ఇప్పటి వరకు జిల్లాలో 101 పాజిటివ్ కేసులు నమోదైనట్లు ఆయన తెలిపారు. రోజుకు కనీసం 300 పరీక్షలు చేపట్టాలని, గుర్తించిన పాజిటివ్ కేసులకు మెరుగైన వైద్యం అందించి, వ్యాప్తి చెందకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆయన అన్నారు. పాఠశాలల్లో పిల్లలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించి, డెంగ్యూ పట్ల చైతన్యం తేవాలన్నారు. ప్రధానంగా నీటి నిల్వలు లేకుండా చూడడం ద్వారా డెంగ్యూను పూర్తిగా అరికట్టవచ్చని ఆయన తెలిపారు. జిల్లాలో ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని, మున్సిపాలిటీ పరిధిలో కార్పొరేటర్లు, పంచాయతీ పరిధిలో సర్పంచులు, వార్డ్ మెంబర్ లను భాగస్వాములు చేయాలని అన్నారు. ప్రతి ఆదివారం ఇంటితోపాటు ఇంటి పరిసరాల లో నీటి నిల్వలు లేకుండా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి, డ్రై డే చేపట్టేలా చైతన్య పరచాలని కలెక్టర్ అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో జిల్లా కలెక్టరేట్ నుండి గ్రామ స్థాయి కార్యాలయం వరకు గురువారం డ్రైడే తప్పనిసరిగా చేపట్టాలని ఆయన అన్నారు. గ్రామాలలో నీటి నిల్వలను తొలగించాలని, నీటి నిల్వలలో ఆయిల్ బాల్స్, గంబూషియ చేప పిల్లలను వదలాలని, యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ పనులు ముమ్మరంగా జరగాలని, పారిశుధ్య పనులు, మురుగు కాలువల పూడికతీత పనులు నిరంతరాయంగా కొనసాగాలని ఆయన తెలిపారు. నీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకు క్లోరినేషన్ చేయాలని, దీనికి లాగ్ బుక్ నిర్వహించాలని ఆయన అన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన తయారు వర్కర్లు, హాస్టల్ కుక్ లకు, రెస్టారెంట్లు, వీధివ్యాపారుల్లో భోజనం, తినుబండారాలు తయారు, సహాయకులు, వడ్డించే వారికి టైఫాయిడ్ పరీక్షలు చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి, ఏ.ఎన్.ఎంలు సమన్వయంతో సబ్ సెంటర్ల ద్వారా పారిశుధ్య ఆరోగ్య పరిరక్షణ చర్యలు పటిష్టంగా జరగాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ పకడ్బందీగా చేపట్టాలని, పాఠశాలలు, కార్యాలయాల్లో ప్రతిఒక్కరికి అందేలా పటిష్ట కార్యాచరణ చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం నగర పాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, జెడ్పి సిఇఓ అప్పారావు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి. మాలతి, డిసిహెచ్ఎస్ రాజశేఖర్, ప్రాజెక్ట్ అధికారి డా. సైదులు, సత్తుపల్లి మునిసిపల్ కమీషనర్ సుజాత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోషణ మాస కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## ఐసీడీఎస్ అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్




**ఖమ్మం, సెప్టెంబర్ 4(విజయంన్యూస్):** సెప్టెంబర్ నెలలో చేపట్టే పోషణ మాస కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో పోషణ మాస కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోషణ మాస కార్యక్రమంలో ఆరోగ్యానికి చిరుధాన్యాల వినియోగం-వాటి లాభాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు లైన్ డిపార్ట్మెంట్ లు అయిన వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యా తదితర శాఖలు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో రక్త హీనత, ఇతర జబ్బులను అరికట్టడానికి పోషణ మాస కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి అంగన్వాడీ సెంటర్ ద్వారా 5 సంవత్సరాల లోపు పిల్లలు ప్రతి ఒక్కరికి ఖచ్చితమైన బరువు, కొలతలు నిర్దిష్ట ప్రమాణాల్లో ఉన్నాయా లేదా చూడాలన్నారు. ఇప్పటి వరకు ఏ పిల్లవాడికి ఏ ఏ టీకాలు ఇవ్వడం జరిగింది, ఇంకా మిగిలిపోయిన టీకాలు ఉంటే చర్యలు తీసుకోవాలని అన్నారు. నట్టాల నివారణ మందుల పై విస్తృతంగా ప్రచారం, అవగాహన కార్యక్రమం చేపట్టాలన్నారు. పిల్లలు, గర్భిణీలకు పౌష్టికారం పై అవగాహన కల్పించడం, 6 నెలల నుండి 3 సంవత్సరాల లోపు పిల్లలలో మామ్, సామ్ పిల్లలను గుర్తించి, వారిని మాములు పిల్లలుగా చేయుటకు చర్యలు చేపట్టాలన్నారు. పల్లె ప్రకృతి వనాలు, పాఠశాలలు, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాలు, కళాశాల, వసతి గృహాలలో కిచెన్ వార్డెన్లు నిర్వహించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్యం, పౌష్టికాహారం, బాల్య వివాహాల నిర్మూలన, మహిళలకు ఉపాధి అవకాశాలు వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. కౌమార దశ అమ్మాయిలు, గర్భిణీలకు రక్త పరీక్షలు నిర్వహించి, జిల్లాలో ఎంతమంది రక్త హీనతతో బాధపడుతున్నారో ఖచ్చితమైన నివేదిక రూపొందించాలన్నారు. మున్సిపాలిటీ, మండలాలు, ప్రతి గ్రామంలో పౌష్టికాహారం, చిరుధాన్యాల ఉత్పత్తి, వినియోగం పై విస్తృతంగా ప్రచారం, అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పోషణ్ మాస కార్యక్రమానికి సంబంధించి గోడ పత్రిక, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా సంక్షేమ అధికారిణి సుమ, జిల్లా అధికారులు, సీడీపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

# ముహూర్తం 'డిసెంబర్ 6'..?

(మొదటిపేజీ తరువాయి..)

ప్రభుత్వాన్ని నడిపిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే 115 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకు సై అంటూ సీఎం కేసీఆర్ శంఖారావం ఊదేశారు. దీంతో ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కూడా అందుకు సర్వం సిద్ధమవుతున్న పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తోంది.. అభ్యర్థుల ఎంపిక కోసం కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ ఇతర పార్టీలు ప్రయత్నాల్లో నిమగ్నమైయ్యారు. ఈనెలాఖరు నాటికి అన్ని పార్టీలు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. ఇక అభ్యర్థులు, ఆశావాహులు ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ప్రజలను ఆకట్టుకునే ప్రచారాల్లో నిమగ్నమైయ్యారు. మరో వైపు రాష్ట్ర ఎన్నికల కమీషన్ కూడా అసెంబ్లీ ఎన్నికల నిర్వాహణకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే అన్ని శాఖలాధికారులను బదిలీ చేపట్టిన ఎన్నికల కమీషన్, ఓటర్ల జాబితా సవరణ, చేర్పులు, మార్పులు ప్రక్రియను ప్రారంభించింది. అలాగే ఈవీఎంలను తనిఖీ చేస్తోంది. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పై ద్రుష్టి పెట్టింది.. పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఇలా నాలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు, ప్రతిపక్ష పార్టీలు, ఆయా రాష్ట్రాల ఎన్నికల కమీషన్ సమయానుకూలంగా ఎన్నికలను నిర్వహించేందుకు సర్వం సిద్ధమైందనే చెప్పాలి..

## జమిలి ఎన్నికలు ఇప్పుడు సాధ్యమేనా..?

కేంద్రప్రభుత్వం జమిలి ఎన్నికలను నిర్వహించేందుకు దూకుడు పెంచింది. ఆ మేరకు కావాల్సిన చర్యలు చేపట్టింది.. అయితే జమిలి ఎన్నికలు ఇప్పుడు నిర్వహించడం సాధ్యమేనా..? అనే ప్రశ్నలు, సందేహాలు దేశవ్యాప్తంగా వినిపిస్తున్ని.. ఒకే నేషన్, ఒకే ఎలక్షన్ అనే నినాదంతో అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలను ఒకే సారి నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలు ప్రక్రియను తెరపైకి తీసుకొచ్చింది. అయితే భారత దేశంలో పలు దఫాలుగా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. భారతదేశంలో ఇప్పటి వరకు మొత్తం 31 రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతుండగా, 2023 నవంబర్ లో చత్తీస్ గడ్, మధ్యప్రదేశ్, మీజోరం రాష్ట్రాలకు ఎన్నికలు జరిగాల్సి ఉంది.. అలాగే 2023 డిసెంబర్ లో రాజస్తాన్, తెలంగాణ, 2024 ఏప్రిల్ మాసంలో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఒడిసా రాష్ట్రాల్లో, 2024 అక్టోబర్ లో హార్యానా, మహారాష్ట్ర, 2024 నవంబర్ లో జార్?ండ్, 2025 ఫిబ్రవరిలో ఢిల్లీ, అక్టోబర్ లో బీహార్ రాష్ట్రాల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. అంటే ఒక ఏడాది సమయంలో 14 రాష్ట్రాల్లో ఎన్నికలు జరగాల్సి ఉండగా, మిగిలిన రాష్ట్రాల్లో ఇప్పటికే ఇన్నికలు జరిగిపోయాయి. కొన్ని రాష్ట్రాలకు మూడేళ్ల సమయం ఉండగా, కొన్ని రాష్ట్రాలకు నాలుగేళ్ల సమయం ఉంది. ఈ క్రమంలో ఆ రాష్ట్రాలకు ఎన్నికలు నిర్వహించడానికి ఆ ప్రభుత్వాలు ఒప్పుకునే అవకాశం లేదు. గత కొద్ది నెలల క్రితమే త్రిపురా, మేఘాలయ, నాగాలాండ్, కర్నాటక రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకునే అవకాశం లేదు. అక్కడ ప్రజలు కూడా వ్యతిరేకించడం ఖాయం. అంతే కాకుండా 2023 సంవత్సరంలో జరగాల్సిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను మరో ఆరు నెలల పాటు పొడగించాల్సి ఉంటుంది.. అదే జరిగితే రాష్ట్రపతిపాలన ఖాయం. దానికి తెలంగాణ తో పాటు చత్తీస్ గడ్, మధ్యప్రదేశ్, మీజోరం, రాజస్తాన్ రాష్ట్రాలు అంంగీకరించే అవకాశం లేదు. దాంతో పాటు మరో ఢిల్లీ, బీహార్ రాష్ట్రాలకు ఇంకా రెండేళ్ల పాటు పరిపాలించే అవకాశం ఉంది.. వాళ్లు ఏడాదిన్నర పాటు ముందస్తు ఎన్నికలకు రావాల్సి ఉంటుంది.. దానికి ఆ రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించే అవకాశం లేదు. అంతే కాకుండా జమిలి ఎన్నికలకు సంబంధించి లోక్ సభ, రాజ్యసభలో బిల్లు ప్రవేశపెడితే అక్కడ 60శాతం మెజారిటీ ఉండాల్సి ఉంది. కానీ కేంద్రానికి 61శాతం బలంగా ఉండగా, రాజ్యసభలో 31 శాతం మాత్రమే బలం ఉంది. అందువల్ల కచ్చితంగా జమిలి ఎన్నికలు జరిగే అవకాశాలు లేనట్లుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## మిని జమిలి జరగనుందా..?

భారతదేశంలో ఒకే నేషన్, ఒకే ఎలక్షన్ పేరుతో జమిలి ఎన్నికలను నిర్వహించాలని భావిస్తున్న కేంద్రప్రభుత్వానికి లీగల్ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే కేంద్రప్రభుత్వం రూట్ మార్చే అవకాశం ఉంది. సుమారు 11 రాష్ట్రాలను కలుపుకుని 'మిని జమిలి' ఎన్నికలను నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.. 2023 నవంబర్, డిసెంబర్ లో జరిగే ఐదు రాష్ట్రాలతో పాటు 2024లోని ఏప్రిల్ జరిగే ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఒడిసా రాష్ట్రాల్లో, 2024 అక్టోబర్ లో హార్యానా, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఒకే సారి జమిలి ఎన్నికలను నిర్వహించాలని కేంద్రప్రభుత్వం భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. దాని ద్వారా ప్రజల్లో వ్యతిరేకత, ప్రభుత్వాల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉండదని కేంద్రప్రభుత్వం భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.. అయితే మిని జమిలి ఎన్నికలకు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అంగీకరించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.. ఎందుకంటే 2023 డిసెంబర్ లో జరిగే ఐదు రాష్ట్రాల్లో రాజస్తాన్, చత్తీస్ గడ్ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా, తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంది. మరో ఆరు నెలలు పెరగడం వల్ల కొంత సమయం ఉండే అవకాశం ఉంది.. తద్వారా ఈ ప్రభుత్వాలు కూడా అంగీకరించే అవకాశం లేకపోలేదు. ఇదే అసరగా చేసుకుని కేంద్రప్రభుత్వం మినిజమిలి ఎన్నికలను నిర్వహించేందుకు బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తుంది. అయితే జమిలి ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే వ్యతిరేకించగా, బీఆర్ఎస్ పార్టీ తటస్థంగా ఉండిపోయింది.

## అక్టోబర్ 1న షెడ్యూల్..?

అంత అనుకున్న సమయానికి ఎన్నికలు జరిగే అవకాశం ఉంటే తెలంగాణ రాష్ట్రంతో పాటు మరో నాలుగు రాష్ట్రాలకు కచ్చితంగా అక్టోబర్ 1న షెడ్యూల్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిబంధనల ప్రకారం షెడ్యూల్ విడుదల చేసిన సమయం నుంచి 45 రోజుల లోపు పోలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. అందులో భాగంగానే డిసెంబర్ 6న పోలింగ్ నిర్వహించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. డిసెంబర్ 6న రిజల్ట్, 25 లోపు ప్రభుత్వ ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం భావిస్తున్నట్లుగా తెలుస్తోంది..అయితే కేంద్రప్రభుత్వం ఏ విధంగా ముందుకు అడుగు వేస్తుందో..? కేంద్ర ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది..

## జమిలి ఎన్నిక పై కేంద్రం సమరం

ఒక వైపు ఐదు రాష్ట్రాలకు ఎన్నికల సమయం దగ్గరపడుతుండటం, జనవరి 2024లోపు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సమయం రావడంతో సీఈసీ ఎన్నికలను నిర్వహించేందుకు కసరత్తు చేస్తుండగా, మరో వైపు కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు జమిలి ఎన్నికల ప్రక్రియను తెరపైకి తీసుకొచ్చింది. దీంతో తెలంగాణ రాష్ట్రంతో పాటు మిగిలిన మూడు రాష్ట్రాలకు ఈ ఏడాది ఎన్నికలు జరుగుతాయా..? లేదంటే మరో ఆరు నెలల పాటు వాయిదా పడే అవకాశం ఉందా..? అనేది ప్రజల్లో మెలుగుతున్న సందేహం. ఇప్పటికే జమిలి ఎన్నికలకు వెళ్లేందుకే కేంద్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. అందు కోసం ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించింది. జమిలి ఎన్నికల బిల్లుతో పాటు పలు బిల్లులను పార్లమెంట్ లో ప్రవేశపెట్టి బిల్లులను పాస్ చేయించుకోవాలని కేంద్రప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.. అందుకు గాను ఇప్పటికే కేంద్రప్రభుత్వం జమిలి ఎన్నికలపై ప్రత్యేకంగా ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. పలు రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకోవాలని ఆ కమిటీ భావిస్తోంది..

# ఖమ్మం గ్రీవెన్స్ డేకి అనూహ్య స్పందన

**దరఖాస్తులు తీసుకున్న జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్**

**సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశం**

**ఖమ్మం సెప్టెంబరు,04(విజయంన్యూస్):**

"గ్రీవెన్స్ డే"లో సమర్పించిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఎర్రుపాలెం మండలం రాజులదేవరపాడు గ్రామానికి చెందిన బండారు అనురాధ తాను రాజులదేవర పాడు అంగన్‌వాడీ సెంటర్-2 నందు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోగా హెల్పర్‌గా సెలక్ట్ చేయడం జరిగినదని కాని ఇప్పటి వరకు ఎలాంటి ఆర్డర్ ఇవ్వలేదని, తనకు ఆర్డర్ ఇప్పించి న్యాయం చేయగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం జిల్లా సంక్షేమ శాఖాధికారిని ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలం బచ్చోడ గ్రామంకు చెందిన ఎన్.రేణుక 20 సంవత్సరాల క్రితం తన భర్త చనిపోవడం జరిగినదని, తనకు ఇంటి స్థలం కాని, ఇల్లుకాని లేదని తనకు ఒక కుమార్తెయని, తనకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం కలెక్టరేట్ డబుల్ బెడ్‌రూమ్ విభాగం పర్యవేక్షకులను ఆదేశించారు. చింతకాని మండలం నేరడ గ్రామంకు చెందిన షేక్ జరీనా 2 సంవత్సరాల క్రితం తన భర్త చనిపోవడం జరిగినదని తనకు ఎలాంటి ఆదెరువు లేదని, వితంతు పింఛనుకు దరఖాస్తు చేసుకోవడం జరిగినదని, వితంతు పింఛను ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని ఆదేశించారు. చింతకాని మండలం నాగిలిగొండ గ్రామానికి చెందిన చాట్ల వాసుదేవరావు తాను డిగ్రి వరకు చదువుకోవడం జరిగినదని, దళితబంధు సర్వే సమయంలో తాను హైద్రాబాదులో ఉండటం జరిగినదని సమాచారం లేక పోవడంతో తాను దళితబంధు పథకంకు దరఖాస్తు చేసుకోలేక పోయినానని తనకు దళితబంధు పథకం మంజూరు చేయగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం ఎస్సీ కార్పోరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు. వైరా మండలం రెబ్బవరం గ్రామంకు చెందిన దారా నాగమని, భర్త జానుకోటీ తాము ఎపిజివిబి రెబ్బవరం బ్యాంకులో వ్యవసాయ అవసరాల నిమిత్తం రూ.80, వేలు ఋణం తీసుకోవడం జరిగినదని, ప్రభుత్వం కల్పించిన రుణమాఫీ పథకంలో తన పేరు లేదని, అట్టి రుణమాఫీ వర్తింప చేయగలరని సమర్పించిన దరఖాస్తును



తగు చర్య నిమిత్తం ఎల్‌డిఎం, వైరా తహశీల్దారును ఆదేశించారు. కంచికచర్లకు చెందిన కొమ్మురి లక్ష్మీ, భర్త భాస్కరరావు తమకు దెందుకూరు గ్రామం నందు సర్వే నెం.40/ఐ లో 1.9 ఎకరం తొమ్మిది కుంటల భూమి కలదని, కొత్త పాసుపుస్తకము నందు అట్టి భూమి తమ ప్రమేయం లేకుండా విభజించబడి 40/ఐ, 40/ఐ2 లుగా వేరొకరిపై నమోదు చేయడం జరిగినదని అట్టి భూమికి సంబంధించిన ప్రతులను సమర్పించు చున్నామని వాటిని పరిశీలించి తమకు న్యాయం చేయగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం వైరా తహశీల్దారును ఆదేశించారు. ఎర్రుపాలెం మండలం చొప్పకట్లపాలెంకు చెందిన వేమిరెడ్డి రంగారెడ్డి తనకు వారసత్వంగా చొప్పకట్లపాలెం గ్రామ రెవెన్యూలో సర్వేనెం.111/అలో ఒక ఎకరము భూమి కలదని, అట్టి భూమిని ధరణిలో దరఖాస్తు చేసుకోవడం జరిగినదని, పాసు పుస్తకము ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం ధరణి విభాగం పర్యవేక్షకులను కలెక్టర్ ఆదేశించారు. "గ్రీవెన్స్ డే"లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

vijayam_daily
vijayam_telugu
vijayam_news
విజయం

# తుమ్మలకు కురుక్షేత్ర యుద్ధమే..!

**కృష్టార్జున విజయానికి కాంగ్రెస్ సరైనా వేదిక"**

**"నిరంతర శ్రమజీవి తుమ్మల**

**జిల్లా రాజకీయ విజయానికి శ్రమించక తప్పదా..?**

**రాజకీయ, సామాజిక వేత్త లోడిగ. వెంకన్నయాదవ్.**

(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2014ముందు అప్పటి టిఆర్ యస్ కేవలం 1,55,000 ఓటింగ్ మాత్రమే ఉండగా శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారి చేరిక ఒక ప్రబంజనంలా ఖమ్మంజిల్లా గులాబీ మయమైందని చెప్పడం లో ఎలాంటి సందేహంలేదు. దానికి నిదర్శనం తుమ్మల చేరిక అనంతరం జరిగిన ఎన్నికల ఓటింగ్ 6,75,000 చేరుకొంది. అంతేకాదు సర్పంచ్‌లు, యం.పి.టి.సి.లు, కార్పోరేటర్లు, ఏకమొత్తంగా చేరడంతో రెండుసార్లు యంయల్ సిలు గెలవడానికి దోహదపడింది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో జిల్లాపరిషత్ ,మున్సిపాలిటీలపై గులాబీ జెండా రెపరెపలాండి. గ్రామ మండల జిల్లా శాఖలు ప్రతిష్టాత్మక మైన పార్టీ నిర్మాణం లో తుమ్మల పెద్ద సహసమేచేశారు అని చెప్పవచ్చు. తుమ్మలపై కొంతమంది ఈరోజు అనేక కుంటి సాకులు చెప్పవచ్చు. ఓడిపోయి ఉంటే పిలిచి మంత్రిపదవి ఇచ్చారు అని ఈరోజు కొందరు తేలికగా మాట్లాడవచ్చు. కాని టిఆర్ యస్



నుండి బి.ఆర్. యస్ గా మార్పు చేసి ఖమ్మం లో పెట్టిన ఆవిర్భావ సభ చూసినప్పుడు తెలుస్తోంది తుమ్మల పార్టీ నిర్మాణం కొరకు చేసిన కష్టం ఎంతో కనపడుతుంది. ఏమిలేనిచోట పార్టీ నిర్మాణం కొరకు ఉభయఖమ్మం జిల్లాలో తన అభిమానులను వెంటబెట్టుకుని వాజేడు నుండి పాలేరు వరకు తుమ్మల పార్టీ కొరకు చేసిన కృషి నిదర్శనమైతే కేసీఆర్ కూడ ఆనమ్మకంతోటే బిఆర్ యస్ఆవిర్భావ సభను ఖమ్మం ఎంచుకొన్నారు. ఇవన్నీ తెలిసి కొంతమంది ని సంతృప్తి పరచడానికి తుమ్మలను పావుగా వాడుకొని తుమ్మలకు ఉన్న 40 సంవత్సరాల అనుభవాన్ని అమానుషంగా అవమాన పరిచిపొమ్మనకుండా పొగపెట్టిన తీరు బాదాకరంగా జిల్లా ప్రజల్లో నిరసన జ్వలలు వెల్లువిరిసాయి.తుమ్మల అభిమానులు రగిలిపోతున్నారు అనడానికి తుమ్మల స్వాగతం పలికిన తీరు నిదర్శనం. కేసీఆర్ తుమ్మల విషయంలో పెద్ద తప్పు చేశారు అని జిల్లాలో ప్రతినోట వినిపించడానికి కారణం అయ్యారు.

ఇంతవరకు బాగానే ఉన్నా ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు తుమ్మలకు రాజకీయంగా పెను సవాల్ అని చెప్పవచ్చు. జరగబోయే పరిణామాలు తుమ్మలకు రాజకీయ కురుక్షేత్రాన్ని తలపించేలా ఉంది. ఎందుకంటే తన 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయజీవితం నుండి నిష్క్రమించాలని అనుకున్న సమయంలో కనిపించని కుట్రలతో రాజకీయ కుతంత్రాలకు బలైపోయిన తుమ్మల ఓటమి పాలై ఇంటికెళ్లడం జిల్లాలో ఏవక్కరు జీర్ణించుకోలేక పోయారు. తుమ్మల మళ్ళీ పోటీ చేసి తాను అనుకున్న సీతారామా ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలతో పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించి ఉమ్మడి ఖమ్మంజిల్లాలో రైతుల మోహంలో చిరునవ్వు చూసి తాను రాజకీయ రిటైర్మెంట్ చేయాలన్న బలమైన కోరికకు కేసీఆర్ ఇప్పుడు ద్రోహం చేశారు అనే బావన తుమ్మల అభిమానులలో జిల్లా ప్రజలలో గూడుకట్టుకొని ఉంది.కాంగ్రెస్ లో చేరి మళ్ళీపోటీ చేసి కేసీఆర్ కు బుద్ధి చెప్పాలని జిల్లా అభిమానులు ప్రజలు బహిరంగా తుమ్మలకు చెప్పి తన ప్రమేయం లేకుండానే కాంగ్రెస్ వైపు అడుగులు వేసేలా తుమ్మలను చేశాయి. పోరాడి ఖమ్మంజిల్లాలో కాంగ్రెస్ పార్టీని రాజకీయ విజయం అందించి తిరిగి తన లక్ష్యసాదలో ఏకలవ్య అంకుటిత దీక్షతో మరో కురుక్షేత్ర సంగ్రామం లో రాజకీయ యుద్ధం ఇప్పుడు తుమ్మలకు సహసమే అయినప్పటికీ తన రాజకీయ బౌషత్ కొరకు జిల్లా ప్రజల ఆకాంక్ష తో తప్పనిసరి అని చెప్పవచ్చు.

అయితే అప్పుడు టిఆర్ యస్ లో చేరిన పరిస్థితి కి ఇప్పుడు కాంగ్రెస్ లో తుమ్మల చేరుతున్న పరిస్థితి కి కొంత వెత్యాసం కనపడుతుంది. జిల్లాలో ఆనాడు టీఆరెస్ అంతంత మాత్రంగానే ఉండేది ఇప్పుడు కాంగ్రెస్ కు బలమైన ఓటింగ్ ఉంది.కేసీఆర్ పై వెతిరేకత తో పాటు తుమ్మల కు అన్యాయం జరిగిందని ప్రజల్లో సానుభూతి ఉంది. వీటికి తోడు శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు తుమ్మలకు జతకడుతున్నారు. కాబట్టి కేసీఆర్ పై కాంగ్రెస్ చేస్తున్న రాజకీయ కురుక్షేత్రమహ సంగ్రామంలో తుమ్మల పొంగులేటి కృష్టార్జున పోరాటం లో ఇద్దరి కలయిక బలమైన శక్తి గా చెప్పవచ్చు. ఇద్దరి సామాజిక వర్గానికి తోడు మల్లు బట్టివిక్రమార్క పెద్దన్నగా తోడు ఉండటం తుమ్మలకు రాజకీయంగా లాబించే అంశం గా చెప్పవచ్చు.10 సంవత్సరాలు గా కాంగ్రెస్ కార్యకర్తలు అధికారంలేక ఈసారి ఎలాగైనా మనం అధికారంలోకి రావాలన్న ఖసి , పట్టుదలతో కార్యకర్తలు ఉన్నారు. ఈ మొత్తం పరిణామాలు రాజకీయ విశ్లేషణ భాగంగా జిల్లా లో పొంగులేటి పదికిపది శభదం సాదించేందుకు తుమ్మల చేరిక ఎంతగానో దోహదపడుతుంది అనటంలో ఎలాంటి సందేహం లేదు.కాని జిల్లాలో నాయకులు ఐఖ్యశంకారావం పూరించాలని ప్రజలు కోరుకొంటున్నారు.



# హిజ్రాలు వేధిస్తే 100కు డయల్ కాల్ చేయండి

**కళ్యాణ మండపాల్లో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న హిజ్రాలను బైండోవర్**

**యాచక పేరుతో బలవంతంగా వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు**

**శుభకార్యలల్లో హల్‌చల్ చేస్తున్న హిజ్రాలకు త్రీ టౌన్ పోలీసుల కౌన్సిలింగ్**

**హిజ్రాలు సమాజంలో గౌరవంగా బతకాలి..ప్రవర్తన మారకుంటే కఠిన చర్యలు తప్పవు**

**ఖమ్మం టౌన్ ఏసీపీ ఎస్వీ హరికృష్ణ**

(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

శుభకార్యలల్లో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న నలుగురు హిజ్రాలను తాసిల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఖమ్మం టౌన్ ఏసీపీ ఎస్వీ హరికృష్ణ తెలిపారు. ఖమ్మంతో పాటు ఇతర ముఖ్య పట్టణాల్లో హిజ్రాలు దాడులకు దిగుతున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు అందుతున్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ ఆదేశాల మేరకు ఖమ్మం టౌన్ ఏసీపీ ఆధ్వర్యంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో హిజ్రాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ..శుభకార్యలల్లో హిజ్రాలు చేస్తున్న వికృత చేష్టల పై దృష్టి పెట్టామని తెలిపారు. శుభకార్యలకు వెళ్లే హిజ్రాలు అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడం,



అందుకు నిరాకరిస్తే అసభ్యకర రీతిలో అక్కడే అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ.. కుటుబ సభ్యులు భయపడేలా చేసి కావల్సిన డబ్బులు బలవంతంగా తీసుకొని వెళ్లిపోవడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా బస్‌స్టాండు,రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్ళలో వ్యాపారులను, ప్రజలను బెదిరించడం, దౌర్జన్యాలు, భయభ్రంతులకు గురి చేస్తున్నారని, ఇలాంటి ఘటనలు పునరావృతం ఆయితే ఉపేక్షించేది లేదని అన్నారు. పెళ్లి మండపాలల్లో ఘర్షణపడి శాంతి భద్రతలకు విఘాతం కల్పించిన వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గోడలపై, ఫంక్షన్ హాల్ వద్ద వర్గాల పేర్లు రాసి బలవంతపు వసూళ్లకు దిగితే డయల్ 100కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.హిజ్రాలకు సహకరించి, ప్రోత్సహించే ఆటో డ్రైవర్లపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సమాజంలో హిజ్రాలు గౌరవంగా బతకాలని..ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో త్రీ టౌన్ సిఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

# కూసుమంచి హైస్కూల్ హెచ్ఎంకు ఉత్తమ ప్రదానోపాధ్యాయుడు అవార్డు

**అభినందనలు తెలిపిన మండల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు**

(కూసుమంచి-విజయం న్యూస్)



కూసుమంచి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రేల విక్రమ్ రెడ్డికి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు అవార్డు లభించింది. విద్యా శాఖ అధికారులు సోమవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల జాబితాను ప్రకటించారు. కార్పొరేట్ కు దీటుగా కొనసాగుతున్న కూసుమంచి ఉన్నత పాఠశాలకు అవార్డు లభించింది. పాఠశాలలో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు, వసతుల వినియోగంలో ముందంజలో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఉపాధ్యాయులే తిరిగి బడిలో చేర్పిస్తుంటే.. ఇక్కడ మాత్రం అన్ని క్లాసుల్లో పరిమితికి మించి సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది 450 కొత్త అడ్మిషన్లు జరిగాయి. డిజిటల్ బోధన కార్పొరేట్ పాఠశాలలకే పరిమితం అయితే వాటిలో చదవాలంటే సంవత్సరానికి లక్షల రూపాయలు చెల్లించాల్సిందే.. కానీ కూసుమంచి ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందించిన ఐఎఫ్‌పీ ద్వారా బోధన సాగిస్తున్నారు. నిత్యం నూతన ఒరవడిని ప్రవేశపెట్టే ప్రధా నోపాధ్యాయుడు, అధునాతన పద్ధతుల్లో బోధించే ఉపాధ్యాయులు ఇలా అందరి అంకితభావంతో పాఠశాల నడుస్తోంది. లైవ్ ఇంటరాక్షన్, జూమ్‌లో బోధన, అన్ని సబ్జెక్టుల సిలబస్ డౌన్‌లోడ్, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, నోట్స్, సైన్స్ లేబొరేటరీ వినియోగం, సైన్స్ వీడియోల పరిశీలన, సోషల్ మ్యాప్స్%--%ముఖ్య పట్టణాల గుర్తింపు, క్విజ్ పోటీల నిర్వహణ, సోషల్ పజిల్స్ ఇలా ఎన్నో కార్యాక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీ, సీవోయి కాలేజీలకు ఎంపికవుతున్నారు. గత ఏడాది పదో తరగతి విద్యార్థులు పది జీపీఏలు ఇద్దరు సాధించారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటారు. ప్రజాప్రతినిధులు, ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థుల భాగస్వామ్యంతో పాఠశాల కొనసాగుతోంది. ఈ సందర్భంగా హెచ్ఎం రేలా విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ సమష్టి కృషితోనే అవార్డు లభించిందన్నారు. అవార్డు రావడం పట్ల ఎస్ఎంసీ చైర్ పర్సన్ ఎస్కే మైమునా, మండల విద్యాశాఖ అధికారి బివి రామాచారి , సర్పంచ్ చెన్నా మోహన్, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్ హర్షం వ్యక్తం చేశారు.

# నాలుగేళ్లలో నలుదిక్కుల అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి..)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా ఎమ్మెల్యేగా నాకు అవకాశం కల్పించిన ఖమ్మం నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నాలుగేళ్లు మంత్రిగా పనిచేసే అవకాశం నాకు దక్కిందని,అందుకు సీఎం కేసీఆర్ కు , ఐటీ మంత్రి కేటీఆర్ కు రుణపడి ఉంటానని అన్నారు. ఖమ్మం మున్నేరుకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణం కు ముందడుగు పడిందన్నారు. ఎనిమిది కిలోమీటర్లు మేర మున్నేరుకు పక్కన గోడ డ్రైనేజ్ కోసం 690కోట్లతో జరుగుతుందని తెలిపారు. మున్నేరు వరద వచ్చిన క్యాబినెట్ మీటింగ్ మున్నేరు సమస్యను తెలపగా మున్నేరు ఫ్లడ్ కు శాశ్వత పరిష్కారం చూపేలా నిధులు ఇవ్వడం శుభ సూచకమని అన్నారు. ఎవరికి ఇబ్బంది లేకుండా ఇళ్లకు కాకుండా సిసివాల్ రివర్ బెడ్ ఏర్పాటు అవుతుంది. ఇప్పటికే ప్లాన్ పూర్తయిందన్నారు. 33 అడుగులు పైన ఆర్ సిసి రక్షణ గోడ ఉంటుందని తెలిపారు. మూడు చెక్ డ్యామ్ లు రూ.30కోట్లతో నిర్మాణం ఉంటుందని, మున్నేరులో వాటర్ ఫ్లో ఉన్నప్పుడు బోటింగ్ పెట్టుకునేలా ఏర్పాటు చేస్తామని అన్నారు. రూ.180 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మాణం కు ప్రణాళిక సిద్ధమైందని, అతిత్వరలోనే పనులు ప్రారంభమవుతాయని అన్నారు. రూ.1000 కోట్ల నిధులు వరద ఖమ్మంకు పారుతుందని, నాలుగేళ్ళ మంత్రి గా ఉన్న సమయంలో



నాకు వెన్నుదన్నుగా ఉండి వేల కోట్ల నిధులు ఇచ్చిన కేసీఆర్ కి రుణపడి ఉంటానని అన్నారు. నాలుగేళ్ళ కాలంలో రూ.2000 వేల కోట్ల నిధులు ఖమ్మం అభివృద్ధికి ఖర్చు చేశామన్నారు. ఖమ్మం ప్రజల రుణం ఎన్నడూ తీర్చుకోలేనిదని, తొమ్మిదిన్నర సవంత్సరాలుగా అండగా ఉంటున్న మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఈనెల 14న ఖమ్మంకు హరీష్ రావు

ఖమ్మంలో నూతనంగా నిర్మాణం చేసిన మెడికల్ కళాశాల క్లాస్‌లు ప్రారంభానికి, భవనం ప్రారంభించేందుకు వైద్యఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు సెప్టెంబర్ 14న ఖమ్మం జిల్లా పర్యటనకు వస్తున్నారని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ని ప్రారంభించిన అనంతరం మమత ఆసుపత్రి సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు.

ఖమ్మం ప్రజలు,సీఎం కేసీఆర్,కేటీఆర్ ది రుణం ఎన్నడూ తీర్చుకోలేనిదన్నారు. త్వరలో ఖమ్మంలో మంత్రి కేటీఆర్ పర్యటన కూడా ఉంటదన్నారు. కేసీఆర్ ,కేటీఆర్ ఖమ్మంను. అభివృద్ధిలో ఆదర్శంగా తీసుకోమని చెప్పడం నా జీవితంలో సంతృప్తినిచ్చిందన్నారు. కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ పథకాలు అడబిడ్డల ఇళ్లకు వెళ్లి వారికి ప్రభుత్వ ఫలాలు ఇవ్వడం మర్చిపోలేనిదని, వారు నాతో మాట్లాడే మాటలు నన్ను కట్టిపడేశాయని, అది కూడా నాకు సంతృప్తినిచ్చిందన్నారు. 70 ఏళ్ల కాలంలో ఎవరూ చేయని అభివృద్ధి పనులు చేశానని, నా తండ్రి కూడా నేను చేసిన అభివృద్ధిని చాలా ఆనందంగా మాట్లాడుతున్నారని అన్నారు. లక్షల్లో ఉన్న భూములు రేట్లు పెరిగాయంటే కారణం అభివృద్ధి జరగడమేనని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ మహనీయుడి విగ్రహ నిర్మాణంను కూడా కొన్ని దుష్టశక్తులు అడ్డుకోవాలి అని చూశారని, ఎన్టీఆర్ విగ్రహం నిర్మాణం విషయంలో శిఖండి రాజకీయాలు చేసినా తానా కమిటీ వాళ్ళు ఎదుర్కొని పనులు చేస్తున్నారని, అన్ని అవాంతరాలను ఎదుర్కొని నిర్మాణ చేపడుతున్న ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణం కమిటీ వారికి నా సెల్యూట్ అని అన్నారు.



ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు కమిటీ వారు పిలిస్తే వెళ్తానని స్పష్టం చేశారు.

### తట్టెడు మట్టి పోయనోళ్ల గురించి మాట్లాడటమే వేస్ట్

ఖమ్మం నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా పనిచేసినోళ్లు ఇప్పుడు రాజకీయాల గురించి అభివద్ధి గురించి మాట్లాడుతుంటే సిగ్గేస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. వారు ప్రజాప్రతినిధులుగా ఉన్నసమయంలో తట్టెడు మట్టి కూడా పోయలేదని, ఒక్కటంటే ఒక్క శిలాఫలకం లేదని, వారు ఖమ్మానికి చేసింది గుండు సున్నా మాత్రమేనని ఆరోపించారు. అభివద్ధి అంటే ఏంటో తెలవనోళ్లు మాట్లాడుతుంటే, వారి గురించి మనం మాట్లాడుకోవడం వేస్టేనని అన్నారు. ఎవరు ఖమ్మంను అభివద్ధి చేశారో ప్రజలకు తెలుసని, ప్రజల మద్దతు నాకు బలంగా ఉందని, కచ్చితంగా నేను మూడవ సారి విజయం సాధించడం ఖాయమన్నారు. మరో సారి గెలిస్తే , నాల్గొవ సారి గెలిచిన ఏం పనులు ఉండవన్నారు. మూడవ సారి గెలిస్తే అభివద్ధి చేయడానికి ఇంకేమి మిగలదని, అంతా మూడవ సారి గెలిసిన సమయంలోనే ప్రజల సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఈ విలేకర్ల సమావేశంలో ఖమ్మం నగర మేయర్ పూనకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, నగరకమిటీ అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు హాజరైయ్యారు.

# మున్నేరుకు ఆర్సీసీ రక్షణ గోడ

**ఇరువైపుల నిర్మాణం కోసం రూ.690 కోట్లు మంజూరు..**
**వెల్లడించిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**
**మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కి, మంత్రి కేటిఆర్‌కి, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పువ్వాడ**



(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

ఖమ్మం మున్నేరు సమీప ప్రాంత ప్రజలకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గుడ్ న్యూస్ చెప్పారు. వరదలు వచ్చిన సమయంలో బిక్కుబిక్కుమంటూ జీవనం వెళ్లదీస్తున్న ముంపుప్రాంత ప్రజలకు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శ్రావణసోమవారం శుభవార్తను అందించారు. మున్నేరు నదికి ఇరువైపుల ఆర్సీసీ రక్షణ గోడలను నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం రూ.690కోట్లను విడుదల చేసిందని, జీవో కాపీతో పాటు ఆయన ప్రకటన విడుదల చేశారు. దాదాపు 8కిలో మీటర్ల మేర రెండు వైపులా ఆర్సీసీ రక్షణ గోడలు పోలేపల్లి నుండి ప్రకాశ్ నగర్ చివరి వరకు రూ.690.52కోట్లు మంజూరు చేయడం



సంతోషకరమన్నారు. ఇటీవలే మున్నేరు ఉధృతి 30 అడుగులు వచ్చిన నేపథ్యంలో దాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్సీసీ రక్షణ గోడల నిర్మాణం 33 అడుగుల పైకి గోడలు ఉండనున్నాయి. రెండు వైపులా డ్రైన్ లైన్స్ లను మున్నేరు చేక్ డ్యాం అవతల ఎస్టీపీ వద్ద డ్రైన్ లైన్స్ అన్ని మున్నేరుకు కలుపుతామన్నారు. మురుగు నీరు, వర్షపు నీరు వేరు వేరు పైప్ లైన్ ద్వారా ప్రవహించేలా ఏర్పాట్లు చేయడమైనదని తెలిపారు. దీనితో పాటు రూ.30 కోట్లతో మున్నేరు పై మూడు చెక్ డ్యాం లు నిర్మాణం జరుగుతుంది. దీని జీవో .రావాల్సి ఉందని, ప్రజలకు ఆహ్లాదం నిమిత్తం మున్నేరులో బోటింగ్ సౌకర్యం నిమిత్తం ప్రతి అర కిలో మీటర్ల వద్ద రక్షణ గోడల మధ్య మెట్లుతో పాటు రైలింగ్ ఎర్పాటు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన విధంగా అజయ్ నా కొడుకు లాంటి వాడు అన్న మాటకు నిదర్శనం ఈ అభివృద్ధి పనులేనన్నారు. మున్నేరు పై రూ.180 కోట్లతో నిర్మించనున్న కేబుల్ బ్రిడ్జి ఇప్పటికే మంజూరు అయింది. దాదాపు మున్నేరు పై ఇప్పటికే రూ.1000 కోట్లు మంజూరు చేయడం సంతోషకరమన్నారు.

మంత్రి గా నాలుగేళ్లు పూర్తి చేసిన సందర్భంగా అడిగిందే తడవుగా ఇన్ని నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం నగరాభివృద్ధికి కేసీఆర్ ఇప్పటికే ఎస్డీఎఫ్, సీఎం అషూరెన్స్ నిధులు ఇచ్చి ఎంతో ప్రోత్సహించారని పేర్కొన్నారు. నన్ను ఖమ్మం ప్రజలు రెండు సార్లు ఎమ్మెల్యే గా గెలిపించి గుండెల్లో పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని నేను ఏనాడు వొమ్ము చేయలేదు. అనుకున్న దానికన్నా ఎక్కువ అభివృద్ధి చేశాం. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. ప్రజలు మళ్ళీ అవకాశం ఇస్తారు.. చేసి తీరుతానని మాటిచ్చారు. రానున్న రోజుల్లో కూడా ఇదే ప్రేమా అభిమానం కురిపించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ నెల 14న నాన్న పువ్వాడ నాగేశ్వర రావు 85వ పుట్టిన రోజు, మమత ఆసుపత్రి స్థాపించి 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మమత ఆసుపత్రి ప్రాంగణంలో సిల్వర్ జూబ్లీ బ్లాక్ ను హరీష్ రావు ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాల ను ప్రారంభిస్తారని అన్నారు.

# కొత్తగూడెంలో బీఆర్ఎస్ దూకుడు



**500 కార్లతో వాహనాలతో భారీ ర్యాలీ..**
**హాజరైన ఎమ్మెల్యే వనమా, ఎంపీ రవిచంద్ర**
**బీఆర్ఎస్ జెండా ఎగరేస్తామన్నఎమ్మెల్యే వనమా**
**అభివద్ధే గెలిపిస్తుందన్న ఎంపీ రవిచంద్ర**

(కొత్తగూడెం-విజయంన్యూస్)

భద్రాద్రికొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గంలో బీఆర్ఎస్ దూకుడు పెంచింది. కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును ఖరారు చేసి ప్రకటించగా, సోమవారం కొత్తగూడెంలో అత్మీయ సమ్మెళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో సుమారు 500 కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెంకు పార్టీ ఇంచార్జిగా నియమితులైన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మొదటిసారిగా సోమవారం కొత్తగూడెం రాగా, ఆయనకు బీఆర్ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఖమ్మం నుంచే హంగు ఆర్భాటాలతో వెళ్లిన వద్దిరాజుకు దారిపొడవునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు%ొ%గజమాలతో సత్కరించగా, దారి పొడువునా పూలవర్షం కురపించారు. .కొత్తగూడెం నియోజకవర్గంలోని సుజాతనగర్ నుంచి పెద్దమ్మగుడి వరకు ఎమ్మెల్యే వనమాతో కలిసి ఓపెన్ టాప్ వాహనంలో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. సుమారు 30 కిలో మీటర్ల ర్యాలీకి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది%ొ% ప్రదర్శనలో కోలాటం, డప్పు నృత్యాలు, కొమ్ము డ్యాన్సులు ఈ ప్రదర్శనలో హైలెట్ గా నిలిచాయి%ొ% రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ కొత్తగూడెం నియోజకవర్గ ఇంఛార్జి వద్దిరాజు రవిచందర్ కు జూలూరుపాడు మండలకేంద్రంలోని మున్నూరుకాపు సంఘంనాయకులు బాపట్ల మురళి ఆధ్వర్యంలో మున్నూరుకాపు సంగం నాయకులు, బిఆర్ఎస్ నాయకులు, అభిమానులు సోమవారం భారీ గజమాలతో ఘనస్వాగతం పలికారు ఈ సందర్భంగా, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జై వద్దిరాజు నినాదాలతో హెూరెత్తించారు. ఖమ్మం నుంచి కొత్తగూడెం బయలుదేరిన ఆయనకు జూలూరుపాడు చంద్రుగొండ చౌరస్తా వద్ద జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దిండిగల రాజేందర్, ఎంపీపీ లావుడ్య సోని, మున్నూరుకాపు సంఘం ప్రముఖులు బాపట్ల మురళి, రామిశెట్టి రాంబాబుల ఆధ్వర్యంలో వందలాది మంది అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రవిచంద్ర రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు అనంతరం గులాబీ శ్రేణులు ఎంపీ వద్దిరాజుకు మున్నూరుకాపు ఖమ్మం జిల్లా అధ్యక్షులు పారా నాగేశ్వరరావులను గజమాలతో సత్కారం చేసిన అనంతరం కార్ల ర్యాలీతో కొత్తగూడెం బయలుదేరారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ కొత్తగూడెంలో మరోసారి వనమా వెంకటేశ్వరరావు విజయం సాధించబోతున్నారని జోస్యం చెప్పారు. వనమా గెలుపును ఏ ఒక్కరు అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ కురువృద్ధుడు,మాజీమంత్రి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన వనమా గెలుపు కొత్తగూడెం రాజకీయాల్లో కీలక మలుపు కానున్నదని వద్దిరాజు పేర్కొన్నారు. .కేసీఆర్ ఆదేశాల మేరకు ఇక్కడ వనమా ను గెలిపించి కానుకగా ఇస్తామని అన్నారు. ఇప్పటికే ప్రత్యేక జిల్లాగా కొత్తగూడెం ను ఏర్పాటు చేసిన కేసీఆర్ అభివృద్ధికి వేల కోట్ల నిధులు ఇచ్చారని తెలిపారు. మెడికల్ కాలేజీ, కలెక్టర్, ఎస్పీ కార్యాలయం, కొత్తగా వచ్చాయని, బొగ్గుగనుల కేంద్రంగా కొత్తగూడెం ఉండగా, పారిశ్రామిక వాడగా ఉన్న పాల్వంచను మరింత అభివృద్ధి చేసుకోవాలనే కేసీఆర్ తిరిగి మూడవసారి అధికారంలోకి రావాలని పిలుపు నిచ్చారు. కేసీఆర్ సంక్షేమ పథకాలు అములు జరగాలంటే ,రైతుబంధు, దళితబంధు,24 గంటల విద్యుత్, కల్యాణ లక్ష్మి, షాదిముబారక్, అమలు జరగాలంటే,పేదలకు పెన్షన్, రూపాయకు కిలో బియ్యం,అమలు కావాలంటే బీఆర్ యస్ అధికారం అవసరమని అన్నారు. గిరిజనులకు 4 లక్షల ఎకరాలకు ఒకే రోజు పోడు భూములు ఇచ్చిన ఘనత కేసీఆర్ దే అన్నారు .స్కాముల ప్రభుత్వం కావాలా..? స్కీముల ప్రభుత్వం కావాలా అని ప్రశ్నించారు. ప్రజలకు అందుబాటులో లేని కొంతమంది డబ్బుసంచులు తీసుకోని వస్తున్నారని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వనమా కావాలా..? చుట్టపు చూపుగా వచ్చే వారు కావాలా అని అన్నారు .మోసపోతే గోసపడతామని గుర్తుచుకోవాలని కేసీఆర్ చెప్పే మాటలను గుర్తు చేశారు. అంతకు ముందు వనమా వద్దిరాజులకు ప్రజలు గజమాలతో స్వాగతం పలికారు. పెద్దమ్మగుడిలో పూజలు చేశారు. తనకు మద్దతుగా వచ్చిన ప్రజలకు ఎమ్మెల్యే వనమా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గెలిచేది నేనే..: వనమా

కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలిచేది నేనేనని, నా గెలుపును ఎవరు ఆపలేరని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. పాల్వంచ బీఆర్ఎస్ సభలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నేను కావాలా..? డబ్బు సంచులతో దిగే నాయకులను గెలిపించుకుందామా..? అని ప్రజలను అడిగారు. ఎక్కడ టికెట్ వస్తుందో తెలియని నాయకులు, ఏదో పార్టీలో చేరి చెబుతున్న కల్లబొల్లి మాటలను నమ్మవద్దన్నారు. నిన్న మొన్నటిదాకా ఇదే బిఆర్ఎస్ పార్టీలో ఉండి, ఇదే పార్టీని ఓడించి, వందల కోట్లు సంపాదించుకొని వెళ్లారని, ఇప్పుడు కేసీఆర్ ని విమర్శిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకేరోజు నాలుగున్నర లక్షల ఎకరాలకు పోడుపట్టాల్సిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు కట్టడంలో కేసీఆర్ కి అపార అనుభవం ఉన్నది. అందుకే సీతారామప్రాజెక్టును నిర్మాణం చేస్తున్నారని అన్నారు. ఏ నియోజకవర్గంలో ఎవరు అభ్యర్థిగా ఉన్నా, మనం వేసే ఓటు కేసీఆర్ కే. మనం ఓటు వేసే సందర్భంలో కేసీఆర్ కనిపించాలని అన్నారు. తెలంగాణలో బిజెపి గ్రాఫ్ టఫీమని పడిపోయిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ వంతువచ్చింది. కానీ వీళ్లకూ గెలిచే శక్తి లేదన్నారు. ఏ నాయకుడికి సమస్య ఉన్నా సమన్వయ పరిచే బాధ్యత నాద అని, . కొత్తగూడెం గెలిచి సీఎం కేసీఆర్ కు గిఫ్ట్ గా ఇద్దామని అన్నారు.
కొత్తగూడెంలో ఎగిరేది బీఆర్ఎస్ జెండా, గెలిచేది కారు గుర్తేనని వనమా ధీమా వ్యక్తం చేశారు.

# ఖమ్మం ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

**రోగులతో మాట్లాడి సౌకర్యాల గురించి తెలుసుకున్న వి.పి.గౌతమ్**

ఖమ్మం, సెప్టెంబర్ 4(విజయంన్యూస్):

జిల్లా ప్రధాన ఆసుపత్రిని ఖమ్మం కలెక్టర్ వి.పి.గౌతమ్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటి, మేల్ మెడికల్ వార్డులను సందర్శించి ఎన్ని కేసులు ఈరోజు వచ్చినవి, ఎన్ని కేసులు డిశ్చార్జ్ చేసినది, ఏఏ వ్యాధులకు సంబంధించిన కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడారు. ఎప్పుడు అడ్మిట్ అయింది, డాక్టర్లు పరీక్షిస్తున్నది, సేవలు అందిస్తున్నది, భోజనం ఇస్తున్నది వివరాలు అడిగి తెలుసుకున్నారు. లక్షణాలున్న వారికి డెంగ్యూ పరీక్ష చేయాలని, ప్రధాన ఆసుపత్రిలో రోజు 100 నుండి 150 పరీక్షలు చేయాలని ఆయన అన్నారు. డ్యూటీ వైద్య సిబ్బంది విధులు ఖచ్చితంగా నిర్వర్తించాలని, అత్యవసర సమయాల్లో రేడియాలజీ టెక్నీషియన్లను పిలిపించాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ తెలిపారు.



## వైద్యశాలలో పనులను పరిశీలించిన కలెక్టర్

ప్రభుత్వ వైద్య కళాశాల మిగులు పనులన్ని త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టర్ ప్రభుత్వ కళాశాల సందర్శించి, పనుల పురోగతిని పరిశీలించారు. లెక్చర్ హాల్ కు సంబంధించి ఏసీ, ఫర్నీచర్ ఏర్పాట్లను చేయాలన్నారు. ఆర్ అండ్ బి శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న బాలికల, పాత జిల్లా వైద్య ఆరోగ్యాధికారి కార్యాలయం మొదటి అంతస్థులో ఏర్పాటుచేస్తున్న బాలుర హాస్టళ్లను కలెక్టర్ పరిశీలించారు. డైనింగ్ హాల్, కిచెన్ రూమ్, డార్మెటరీ లను పరిశీలించారు. డోర్, కిటికీలకు వైర్ మెష్ లు పరిశీలించారు. టాయిలెట్లకు కనెక్షన్లు ఇచ్చి, పూర్తి స్థాయిలో పనులు పూర్తి చేయాలన్నారు. హాస్టళ్ల లోపల, ఏర్పాటుచేసిన ఫర్నిచర్ శుభ్రపరచాలని ఆయన అన్నారు. హాస్టల్ సౌకర్యం కొరకు 38 మంది బాలికలు, 22 మంది బాలురు ఇప్పటివరకు నమోదు చేసుకున్నట్లు, మిగతా వారిలో స్థానికేతరులను సంప్రదించి, హాస్టల్ లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పెయింటింగ్ రెండో కోట్, మిగులు పనులన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, కళాశాల ప్రారంభ దినాన మంచి వాతావరణం స్ఫూరించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కలెక్టర్ తనిఖీ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజేశ్వరరావు, ఆర్ఎంఓ శ్రీనివాసరావు, డిఎంఓ శ్రీనివాస్, డిఇ శ్రీనివాస్, వైద్య సిబ్బంది తదితరులు వున్నారు.